క్లుప్తంగా

రేపు పాఠశాలల బంద్


మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

ఎల్లారెడ్డిపేట: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఏబీవీపీ రాష్ట్ర హస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ తెలిపారు. ఎల్లారెడ్డిపేటలో సోమవారం మాట్లాడారు. బడులు ప్రారంభమై రెండు వారాలు కావస్తున్నా.. ఇప్పటివరకు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయలేదన్నారు. నాయకులు పెండ్యాల శివ, కొప్పుల నవీన్, మందాటి శివప్రసాద్, మిర్యాల్కర్ పవన్ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక


పాల కేంద్రం కార్యవర్గ సభ్యులు

ఎల్లారెడ్డిపేట: అక్కపల్లి గ్రామంలోని కరీంనగర్ డెయిరీ పాల కేంద్రం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొప్పుల కర్నాకర్‌రెడ్డి, సభ్యులుగా కొప్పుల రవీందర్‌రెడ్డి, జిన్న స్వామి, చెట్కూరి నారాయణగౌడ్, గోగూరి ప్రదీప్‌రెడ్డి, జంగ భూంరెడ్డి, బోనాల రవి, మందాటి అరుణ్‌కుమార్, బోనాల శ్రీధర్, ముక్క ఎల్లయ్య ఎన్నికయ్యారు. డెయిరీ సూపర్‌వైజర్ నాగరాజు, సెక్రటరీ రవికాంత్, రైతులు జనార్దన్‌రెడ్డి, దేవేందర్ యాదవ్, వర్కుటి రాజు, ప్రవీణ్‌రెడ్డి, మల్లారెడ్డి, సతీష్‌రావు, ఎల్లయ్య, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

ఎల్లారెడ్డిపేట: యువత విద్యార్థి స్థాయి నుంచే ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని దాన్ని సాధించడానికి అహర్నిశలు కృషి చేయాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ క్యాతం సత్యనారాయణ అన్నారు. ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం మాదక ద్రవ్యాల నిరోధక కమిటీ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు బాల్యం నుంచే మంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి వాసరవేణి పర్శరాములు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడూర్ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్


వివిధ వంటకాలతో చిన్నారులు

తంగళ్లపల్లి: తాడూర్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. చిన్నారులు వివిధ రకాల వంటకాలను ఇంటి వద్ద నుంచి తీసుకొచ్చి తోటి విద్యార్థులతో కలిసి ఆరగించారు.

పర్యావరణ ప్రేమికుడికి జాతీయ పురస్కారం


రమేశ్

ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్‌కు చెందిన పర్యావరణ పరిరక్షకుడు దుంపెన రమేశ్ భారతరత్న పీవీ నరసింహారావు స్మారక జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు-వెలుగు జాతీయ పురస్కారాల మహోత్సవంలో భాగంగా ఈనెల 30న కరీంనగర్‌లో అవార్డు అందుకోనున్నారు. రమేశ్ 13 ఏళ్లుగా మండలంలోని పలు గ్రామాల్లో తన సొంత ఖర్చులతో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. తన ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచుతూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడితేనే భావితరాలకు భవిష్యత్తుంటుందని రమేశ్ కరపత్రాలను విడుదల చేసి మొక్కల పెంపకంపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. పర్యావరణంపై రమేశ్ చేస్తున్న కృషిని గుర్తించి తెలుగు-వెలుగు వారు జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక చేశారు. రమేశ్ ఇప్పటివరకు 9 అవార్డులను అందుకున్నారు.

జిల్లెల్ల కొత్త చెరువు శిఖం భూమిని రక్షించాలి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): జిల్లెల్ల గ్రామంలోని కొత్త చెరువు శిఖం భూమిని కబ్జా చేస్తున్న వారిపై, కబ్జాదారులకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లెల్ల గ్రామ రైతులు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

జోరుగా మట్టి దందా

- చెరువులు, కుంటలు ఖాళీ
- మాయమవుతున్న గుట్టలు
- అక్రమంగా తరలిపోతున్న మట్టి
- పట్టించుకోని మైనింగ్ అధికారులు
- ట్రిప్పునకు రూ.3వేల చొప్పున విక్రయాలు


మండల అధికారులు సీజ్ చేసిన మట్టి తరలిస్తున్న టిప్పర్లు

ఎల్లారెడ్డిపేట: మండలంలో మట్టి దందా జోరుగా సాగుతోంది. అధికారుల కళ్ల ముందే ట్రిప్పుల కొద్దీ మట్టి తరలిపోతున్నా పట్టించుకోవడం లేదు. మట్టి తరలింపు స్మగ్లర్లకు కాసులు కురిపిస్తోంది. చెరువులు, కుంటలు, గుట్టలను తవ్వి మట్టిని తరలిస్తుండడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. మట్టిని తరలించడానికి తప్పనిసరిగా మైనింగ్, రెవెన్యూ శాఖల నుంచి అనుమతులు తీసుకోవాల్సిన అవసరముంది. కానీ మట్టి స్మగ్లర్లు ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. చెరువుల్లో ఉన్న మట్టిని పంట పొలాల్లో పోయిస్తే పంటలకు పోషకాలు అందుతాయని రైతులు డబ్బులు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. ఇదే ఆసరాగా చేసుకొని స్మగ్లర్లు అందినకాడికి దండుకుంటున్నారు.

రూ.3వేలకు ట్రిప్పు

మట్టి తరలింపునకు లారీలు, టిప్పర్లను వినియోగిస్తున్నారు. చెరువులు, కుంటలు, గుట్టల్లో జేసీబీల సహాయంతో మట్టిని తవ్వుతూ లారీలు, టిప్పర్లలో తరలిస్తున్నారు. ఒక లోడ్‌కు రూ.3వేల చొప్పున విక్రయిస్తున్నారు. ఇలా రోజుకు మండలం నుంచి సుమారు 50 నుంచి 60 టిప్పులు తరలిపోతున్నాయి. ఈ లెక్క ప్రకారం ప్రతిరోజు రూ.1.80లక్షల మట్టి వ్యాపారం మండలంలో సాగుతోంది. అనుమతులు తీసుకోకపోవడంతో ప్రభుత్వానికి ఎలాంటి ఆదాయం రావడం లేదు. టిప్పర్లను రెవెన్యూ అధికారులు అప్పుడప్పుడు పట్టుకొని సీజ్ చేస్తున్నా.. మట్టి దందా మాత్రం ఆగడం లేదు. ఫలితంగా గ్రామాల్లోని సహజ వనరులు ధ్వంసమవుతున్నాయి.

పడిపోతున్న భూగర్భ జలాలు

చెరువులు, కుంటలు, గుట్టల నుంచి మట్టి తరలిస్తుండడంతో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. గతంలో మానేరు వాగు ఏడాది పొడవునా నీరు పారేది. కానీ నేడు వర్షాకాలంలోనూ నీటి ధార లేకుండా పోయింది. పంట పొలాల్లో బోరు బావులు వట్టిపోతున్నాయి. కొత్తగా 400 నుంచి 500 ఫీట్ల వరకు వేస్తేనే బోరు బావుల్లో నీటి ధారలు వస్తున్నాయి. మానేరు వాగు వెంట ఇసుక, మట్టి తరలింపుతో భవిష్యత్తులో రైతులకు సాగు నీరందడం కష్టంగా మారే అవకాశాలున్నాయి. సహజ వనరుల దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిన అవసరముంది. ఇప్పటికైనా మైనింగ్, రెవెన్యూ అధికారులు స్పందించి మట్టి దందాను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

అనుమతులు లేకుంటే కఠిన చర్యలు



అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వాహనాలను సీజ్ చేస్తాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. పెద్దఎత్తున జరిమానాలు విధిస్తాం. అనుమతులు లేకుండా మట్టిని తరలించడం నేరం. అవసరాల కోసం మట్టి తప్పనిసరైతే మైనింగ్, రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. మట్టి తరలింపుపై గట్టి నిఘా ఉంచాం. – రామచంద్రం, తహసీల్దార్

చెరువులు ధ్వంసం



అనుమతులు లేకుండా అక్రమంగా చెరువులు, కుంటలు, గుట్టల నుంచి మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కొంతమంది తమ స్వార్థం కోసం మట్టిని తరలిస్తుండగా.. చెరువులు, కుంటలు, గుట్టలు ధ్వంసమవుతున్నాయి. మండలం నుంచి నిత్యం 60 వాహనాల వరకు మట్టిని తోడేస్తున్నాయి. మైనింగ్, రెవెన్యూ అధికారులు మట్టి తరలిపోకుండా తగు చర్యలు తీసుకోవాలి.

– నిమ్మల బాబు, రైతు, దుమాల


పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వేములవాడఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 1986–89 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం వేములవాడలో సోమవారం ఘనంగా జరిగింది. గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు అన్నయ్య, హన్మండ్లు, రాజిరెడ్డి, పూర్వ విద్యార్థినులు పుట్టపాక రాజేశ్వరి, గీత, మంజుల తదితరులున్నారు.

జగిత్యాల ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం


చెక్కపల్లిలో సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


సిరిసిల్లలో..

వేములవాడరూరల్: బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను సోమవారం వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ తరఫున గెలిచి వేరే పార్టీలోకి వెళ్లి కన్నతల్లి లాంటి పార్టీని మోసం చేయడానికి మనసు ఎలా వచ్చిందని విమర్శించారు. రవి, సుమన్, మల్లారం తిరుపతి, పిట్టల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: వేములవాడ బీఆర్ఎస్ నాయకులు సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను తెలంగాణ చౌక్‌లో దహనం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని నాయకులను ఠాణాకు తరలించారు. కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి రాంచందర్, నాయకులు అంజద్‌పాషా, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల బీఆర్ఎస్‌వీ నేతలు గాంధీ చౌక్‌లో సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్ మాట్లాడుతూ.. సీఎం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. కంచర్ల రవిగౌడ్, షేక్ సికిందర్, మెట్టెల సాయి, అనిల్, దీపక్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. కారు గుర్తుపై గెలిచిన సంజయ్‌కుమార్ తన స్వార్థ రాజకీయాల కోసం పార్టీ మారడం సిగ్గుచేటన్నారు. మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు అందే సుభాష్, కొండ రమేశ్‌గౌడ్, పాశం దేవారెడ్డి, రాగం ఎల్లయ్య, ఎడ్ల సందీప్, బందారపు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య ఆధ్వర్యంలో సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: మండల కేంద్రంలోని అమర వీరుల స్తూపం వద్ద సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య ఆధ్వర్యంలో దహనం చేశారు. చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, మాజీ సెస్ డైరెక్టర్ దప్పుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న సంజయ్ విధానాన్ని బీఆర్ఎస్ తంగళ్లపల్లి అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న ఖండించారు. మండల కేంద్రంలోని మండెపల్లి చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేస్తూ సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పడిగెల రాజు, బండి దేవదాస్, జగన్, మాట్ల మధు, సిలివేరి చిరంజీవి, గుండు ప్రేమ్‌కుమార్, కందుకూరి రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. తెలంగాణ చౌక్‌లో ఎమ్మెల్యే సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నర్సింహారెడ్డి, కొమ్ము బాలయ్య, చెవుల మల్లేశ్, యాది మల్లేశ్, భరత్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు


నిజామాబాద్‌లో విద్యార్థుల ఎత్తు, బరువు చూస్తున్న పీఈటీలు

కోనరావుపేట: నిజామాబాద్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు సోమవారం ఎంపిక పోటీలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు షాబొద్దీన్ మాట్లాడుతూ.. పిల్లలు పోటీల్లో బాగా రాణించి పేరు తీసుకురావాలని కోరారు. ప్రతిభ కనబరిచినవారిని జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు పీఈటీ అజయ్ తెలిపారు. పీఈటీలు అనూష, సంతోష్, వనిత, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: హైదరాబాద్‌లో స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు పోతుగల్ జెడ్పీ స్కూల్ మైదానంలో సోమవారం విద్యార్థులకు అర్హత పరీక్షలు నిర్వహించారు. మండలం నుంచి పది మంది బాలికలు, పది మంది బాలుర ఎంపికకు లాంగ్‌జంప్, రన్నింగ్, హైజంప్ వంటి పోటీల్లో పరీక్షలు నిర్వహించామని సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ వెల్ముల బుచ్చిరెడ్డి తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్లు రాజశేఖర్, అనిల్, పర్శరాములు, శ్రీనివాస్, శ్యామ్‌సుందర్, విద్యార్థుల తల్లిదండ్రులున్నారు.

బోయినపల్లి: స్పోర్ట్స్ స్కూళ్లలో ఆటలతో కూడిన చక్కని విద్య అందుతుందని, విద్యార్థులు స్పోర్ట్స్ స్కూళ్లను ఉపయోగించుకోవాలని తహసీల్దార్ పుష్పలత సూచించారు. మండల కేంద్రంలోని హైస్కూల్ మైదానంలో స్పోర్ట్స్ స్కూల్‌లో 4వతరగతి ప్రవేశాలకు జరిగిన ఎంపిక పోటీలను సోమవారం ప్రారంభించారు. ఎంపికైన విద్యార్థులు సిరిసిల్ల స్టేడియంలో జరిగే పోటీలకు ఈనెల 28న ఉదయం 9 గంటలకు హాజరు కావాలని ఎంఈవో శ్రీనివాసదీక్షిత్ తెలిపారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ప్రారంభించారు. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి దాదాపు 50 విద్యార్థులు హాజరయ్యారు.

కొత్తపేటలో వ్యక్తి అదృశ్యం


శంకర్(ఫైల్)

చందుర్తి: చందుర్తి మండలం కొత్తపేటకు చెందిన పిట్టల శంకర్(50) కనిపించడం లేదని అతని భార్య తులసి సోమవారం స్థానిక పోలీసులను ఆశ్రయించింది. ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన శంకర్ సోమవారం ఉదయం వరకు తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. శంకర్ భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

రేపు అడ్వకేట్లకు హెల్త్‌క్యాంప్

వేములవాడ: వేములవాడ అడ్వకేట్లకు ఈనెల 26న మెగా హెల్త్‌క్యాంప్ నిర్వహిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, ప్రధాన కార్యదర్శి రజనీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్చ్యూన్ మెడికేర్ ఆసుపత్రి దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వేములవాడ అడ్వకేట్లకు టూడీ ఈకో, బీపీ, షుగర్ టెస్టులు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు.

బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి


మాట్లాడుతున్న కడారి రాములు

సిరిసిల్లటౌన్: పనుల్లేక.. పొట్టకెళ్లక బలవన్మరణాలకు పాల్పడిన సిరిసిల్ల నేత కార్మిక కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. సోమవారం సిరిసిల్లలోని కార్మిక భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్లో మాట్లాడారు. నాయకులు అజ్జ వేణు, కోరెపు క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


ఎల్లారెడ్డిపేటలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్లగొల్లపల్లి, ఎల్లారెడ్డిపేటలో సోమవారం పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేసి సరైన ధ్రువపత్రాలు లేని 11 వాహనాలకు జరిమానాలు విధించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు పోలీసులు మూడు గంటలపాటు వాహనాలను తనిఖీ చేశారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు వెంట సరైన ధ్రువపత్రాలు ఉంచుకోవాలన్నారు. ఏఎస్సై కిషన్‌రావు, హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, శంకరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నాయకుల పరామర్శ


మేడిపల్లి సత్యంను పరామర్శిస్తున్న ఆగయ్య


శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న లక్ష్మినర్సింహారావు

ఎల్లారెడ్డిపేట: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూపాదేవి ఇటీవల మరణించగా.. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య సోమవారం సత్యంను పరామర్శించారు. హైదరాబాద్‌లోని అల్వాల్ పంచశీలకాలనీలోని సత్యం నివాసానికి వెళ్లి ఎమ్మెల్యేతోపాటు వారి కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యమిచ్చారు. బీఆర్ఎస్ కోరుట్లపేట గ్రామ శాఖ అధ్యక్షుడు బాలమల్లు, నాయకులు దేవానందం, రఘునందన్‌రావు తదితరులున్నారు.

వేములవాడరూరల్: హన్మాజిపేట గ్రామ మాజీ సర్పంచ్ జంకె విజయ భర్త శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురి కాగా.. వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు సోమవారం ఆయనను పరామర్శించారు. గడ్డం హన్మాండ్లు, రవి, వెంకటేశ్, అంజి తదితరులున్నారు.

లాల్‌సింగ్‌తండాలో అంధకారం



వీర్నపల్లి: లాల్‌సింగ్‌తండా గ్రామ పంచాయతీలో వారం రోజుల నుంచి చిమ్మ చీకట్లో ఉంటున్నామని సోమవారం గిరిజనులు వాపోయారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో విషపురుగులు తిరిగే ప్రమాదముందని వాపోతున్నారు. అధికారులు స్పందించి వీధి దీపం అమర్చాలని కోరుతున్నారు.

వ్యవసాయ పనుల్లో రైతన్న నిమగ్నం


పొలం దున్నుతున్న రైతు

వీర్నపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో ఇప్పటివరకు తేలికపాటి వర్షాలు పడగా.. రైతులు పొలం పనులు ప్రారంభించారు. వరి పంట సాగుకు దుక్కి దున్నిన మడుల్లో వరి విత్తనాలు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. పూర్తిస్థాయిలో వర్షాలు కురిస్తే బాగుండని రైతులంటున్నారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ

రుద్రంగి: రుద్రంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ పులి గంగయ్య ప్రభుత్వం నుంచి ఉచితంగా అందజేసే పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత పాఠ్య పుస్తకాలతోపాటు నాణ్యమైన విద్యనందిస్తూ స్కాలర్‌షిప్ కూడా ఇస్తోందన్నారు.

గుడుంబా విక్రయిస్తున్న మహిళ బైండోవర్

వేములవాడ అర్బన్: కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామ పరిధి లచ్చపేటతండాకు చెందిన గుగులోతు శ్రీనిధి అనే మహిళ గుడుంబా విక్రయిస్తుండగా.. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్లో అధికారులు పట్టుకున్నారు. సోమవారం వేములవాడ తహసీల్ కార్యాలయంలో బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు కల్పించాలి


బాల్‌రాజ్‌కు సమస్యలు వివరిస్తున్న అంగన్వాడీ టీచర్లు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో అనేక సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించి అన్ని మౌలిక వసతులు కల్పించాలని అంగన్‌వాడీ టీచర్లు కోరారు. మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకుడు కేంద్రాలకు వెళ్లి సమస్యలడిగి తెలుసుకున్నారు. ఎలక్ట్రికల్, మరుగుదొడ్లు, భవనాలకు మరమ్మతు చేయాలని కోరారు. ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని బాల్‌రాజ్ తెలిపారు.

చిత్ర కథ


నీరు పోయేదెట్లా..?

చందుర్తి: వేములవాడ–కోరుట్ల ప్రధాన రహదారైన చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలోని మూడు దారులు కలిసే ముఖ్య కూడలి వద్ద కల్వర్టు పైపునకు అడ్డంగా మట్టి పోయడంతో.. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డుపై నీరు నిలిచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడ్డంగా ఉన్న మట్టిని తొలగిస్తే వర్షపు నీరు కల్వర్టు ద్వారా బయటకు వెళ్తుందని తెలిసి కూడా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో మలుపు వద్ద వర్షం నీరంతా చేరి కుంటను తలపిస్తోంది.

నిరుపేద కుటుంబానికి చేయూత

బోయినపల్లి: అనంతపల్లికి చెందిన నిరుపేద నూనె తిరుపతి అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గంగాధర మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన తూడి లచ్చయ్య.. తిరుపతి అంత్యక్రియలకు రూ.10వేల ఆర్థిక సాయం పంపారు. ఆ నగదును గ్రామానికి చెందిన తూడి లచ్చన్న యువసేన సభ్యులు మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు.

రేపు విశ్రాంత ఉద్యోగులకు కంటి పరీక్షలు

సిరిసిల్లకల్చరల్: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టీవీ లక్ష్మణ్‌రావు, జోగినిపల్లి మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మెడివిజన్ హైదరాబాద్ వారి సౌజన్యంతో నిర్వహించే ఈ శిబిరంలో అవసరమున్న విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పరీక్షలు చేయించుకోవాలని కోరారు. తమ వెంట ఈహెచ్ఎస్ కార్డు తీసుకురావాలని సూచించారు.